



**మనిషికీ** ఆత్మవిశ్వాసంతో, ఆత్మస్థయిర్యంతో దేన్నైనా ఎందుకు సాధించలేను? తనకు అసాధ్యం అనేది ఏముంది? అనే ఆలోచనల్లోంచే పట్టుదల పుట్టింది. ఆ పట్టుదలకు కొద్దిగా మొండితనం, మరి కొన్త తెగువ, ఇంకొన్త పైత్యం తోడైతే పందెం కాస్తాడు.

వెంకోజిరావు విశాఖపట్నంలో పెద్ద పారిశ్రామికవేత్తలలో ఒకడు. ప్రతి సంవత్సరం ఏదో ఒక సెలవు రోజున తన మిత్రు లందరితో స్నేహం నిలువుకోవటానికి, తోటి వ్యాపారవేత్తలలో అసూయ కల్గించటానికి, అధికారులలో భయం పుట్టించటానికి గ్రాండ్‌గా పార్టీ ఇస్తుంటాడు.

ఎప్పటిలానే ఈ సంవత్సరం ఓ ఆదివారం గ్రాండ్‌గా పార్టీ ఏర్పాటుచేశాడు.

విశాఖపట్టణానికి దూరంగా సముద్రం పక్కగా, భీమునిపట్నం వెళ్ళే దారిలో పెద్ద ఎస్టేట్ ఒక



# అమర్ మోహన్
# పందెం

ఖుంది వెంకోజీరావ్‌కి. యాభై ఎకరాల విస్తీర్ణంలో ఉద్యానవనం మధ్యన లంకంత ఇల్లుంది. దానిలోనే పార్టీ ఏర్పాటుచేశాడు.


సాయంత్రం ఆరు కావస్తోంది. ఇంటి ముందున్న తోటలో బఫే డిన్నర్ ఏర్పాటుచేశాడు. నార్త్ ఇండియన్ డిషెస్ దగ్గర్నుంచి చైనీస్ డిషెస్ వరకు అన్ని రకాల వంటలు తయారు చేయించాడు. పచ్చని చెట్లకు రంగురంగుల బల్బులు అమర్చి శోభాయమానంగా ఏర్పాట్లు చేయించాడు. ఆహ్వానితు లొక్కరొక్కరే వస్తున్నారు.



వెంకోజీరావు సస్మితంగా అతిథుల్ని ఆహ్వానిస్తున్నాడు. ఏడున్నరకల్లా రావలసిన వాళ్ళంతా వచ్చారు.

వెంకోజీరావు అందరివైపు ఓ సారి సంతృప్తిగా చూసి అన్నాడు: "డియర్ ఫ్రెండ్స్...నా ఆహ్వానాన్ని మన్నించి వచ్చినందుకు ముందుగా నా కృతజ్ఞతలు. బాగా ఎంజాయ్ చేయండి. తినండి ...తాగండి... మీ ఇష్టం. అందరూ సంతృప్తిగా వెళ్ళాలి."

విశాఖపట్నంలో వెంకోజీరావు వ్యాపార లావాదేవీల్లో నమ ఉజ్జీ, ప్రత్యర్థి అయిన సుబ్బరామయ్య కూడా వచ్చాడు. లోలోపల ఎన్ని కోపతాపాలున్నా కలుసుకున్నప్పుడు ముఖానికి నవ్వు పులుముకుని చూసేవారికి ఆశ్చర్యాన్ని కలిగించేంతగా ఆప్యాయతను చూపించుకుంటారు.



కానీ ఒకరి మీద ఒకరు దెబ్బతీసుకునేందుకు, ఒకర్ని ఒకరు మించిపోయేందుకు అనుక్షణం ప్రయత్నిస్తూనే ఉంటారు.

కబుర్లు దొర్లిపోతున్నాయి. రిచ్‌నెస్ అంతా పార్టీకి వచ్చిన వ్యక్తుల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఉన్నట్టుండి ఓ చోట బాతాఖానీ కాస్త సంఘర్షణలోకి దిగింది. అదే పట్టుదలగా మారింది.

సుబ్బరామయ్య అంటున్నాడు తనకు అపారమైన సంపద ఇచ్చిన అహంతో-"ప్రపంచాన్ని నడిపించేది డబ్బు. ఏం సంపాదించాలన్నా, ఏది పొందాలన్నా డబ్బుమాత్రమే దాన్ని సాధించిపెట్టగలదు..."

భానోజీ అనే మరో వ్యాపారవేత్త "డబ్బువలన అన్నీ పొందవచ్చు కానీ, ప్రేమాభిమానాలు పొందలేం..." అన్నాడు. చిలికి చిలికి గాలివాన అయింది. పందెం వరకూ పోయింది ఆ ఘర్షణ.

"అయితే పందెం కాద్దాం...ఎవరైనా వయసులో ఉన్న కుర్రాడి ముందు అందమైన అమ్మాయిని, అపారమైన డబ్బుని పెడితే డబ్బే అతన్ని ఆకర్షిస్తుంది. కావాలంటే పందెం..."

సుబ్బరామయ్య అభిప్రాయంతో భాగ్యవంతుడిగా వెంకోజి అంతరంగంలో అంగీకరించినా అసూయతో సుబ్బరామయ్య అభిప్రాయాన్ని ఖండించాడు. పార్టీకి వచ్చిన వాళ్ళంతా జరుగుతున్న ఘర్షణను థ్రిల్లింగ్‌గా చూస్తున్నారు. ఇది ఎక్కడికి దారి తీస్తుందో అన్న ఉత్కంఠతో.

"పందెం" అన్నాడు సుబ్బరామయ్య.

"పందెం" అన్నాడు వెంకోజి.

"ఎంత?"

"లక్ష."

"ప్స్...మన స్తోమతకు తగ్గ పందెం కాదు."

వెంకోజీలో పట్టుదల పెరిగింది.

"పది లక్షలు. సరేనా?" అన్నాడు.

పందెం ఖాయమయింది. ఒక వయసులో ఉన్న యువకుణ్ణి వెతికి అతని ద్వారా ఆ పందెం నిరూపించుకోవాలి. అలాంటి యువకుడికోసం వేట ప్రారంభమయింది.

అంతలో పార్టీకి సర్వ్ చేసేందుకు వచ్చిన కాశ్యప్‌కి ఆ పందెంపట్ల ఆసక్తి కలిగింది. సర్వ్ చేస్తున్న డిష్‌ని అక్కడ పెట్టేసి "మీ పందానికి నేను పనికొస్తానా?" అని అడిగాడు ఆసక్తిగా. అందరూ అతనివైపు ఆశ్చర్యంగా చూశారు.

వయస్సు ఇరవై రెండు, ఇరవై మూడు ఉంటుంది. ఆరోగ్యంగా, బలంగా, అందంగా ఉన్నాడు.

"ఏం చదివావ్?"

"ఎమ్. ఎ."

ప్రస్తుతం ఏం చేస్తున్నావ్...?

"స్టెవార్డ్."

"వెరీగుడ్...నీలాంటి వాడే మా పందానికి కావలసింది..."

'ఎమ్. ఎ. చదివికూడా సర్వర్‌గా చేసేవాడికే డబ్బు విలువ, ఈ ఆర్థిక అసమానతల సమాజం పట్ల తాను ఆశించే లక్షణా లుండేది.' మనసులోనే అనుకున్నాడు సుబ్బరామయ్య.

"నీవు సిద్ధమేనా!" ప్రశ్నించాడు సుబ్బరామయ్య.

"సిద్ధమే."

"ఇప్పుడు పందెం గురించి వివరంగా మాట్లాడుకుందామా?" అన్నాడు సుబ్బరామయ్య.

"ఓ. కే." అన్నాడు వెంకోజీ.

"ఇతన్ని ఎక్కడుంచాలి? ఎవరు పరిశీలించాలి?" అడిగాడు సుబ్బరామయ్య. "ఓ పని చేద్దాం. నా ఎ స్టేట్‌లోనే ఉంచుతాను రెండేండ్లవరకు. అతను ఈ ఎ స్టేట్ దాటకూడదు. ఈ రెండేండ్లలో నేను అతన్ని చాలా పరీక్షలకు గురిచేస్తాను. అప్పటికీ అతను డబ్బువైపు మొగ్గుచూపితే నేను ఓడిపోయినట్లు...సరేనా?" అన్నాడు వెంకోజి.

"సరే..."

"మీ ఇద్దరిదీ బాగానే ఉంది. మరి నాకేం లాభం?" ఉన్నట్టుండి అడిగాడు కాశ్యప్.

అప్పు డనుకొన్నారు వెంకోజి, సుబ్బరామయ్య

కాశ్యప్ బాగా తెలివి కలవాడని.

"ఇందులో ఎవరు పందెం గెలిచినా వచ్చే పది లక్షలలో ఒక లక్ష నీ కిస్తాం. నువ్వు డబ్బువైపు మొగ్గు చూపితే నేను నీకు ఇంకో అయిదు లక్ష లిస్తాను. ఎందుకంటే. డబ్బే గొప్పదంటే నేను గెలుస్తాను కనుక" అన్నాడు సుబ్బరామయ్య. "ఓ.కే. డన్..." వాళ్ళ వాళ్ళ పాత కక్షల్ని తవ్వు కుంటూ అవివేకమైన పందెం కాస్తున్నారు- 'తను పావు మాత్రమే పావుగా ఉపయోగపడినందుకు లక్ష రూపాయ లిస్తున్నారు. లాభసాటి పందెమే...' అనుకున్నాడు కాశ్యప్.

పార్టీలో అందరి ముందు పందెం ఖరారు అయింది. పందెం ప్రారంభం కాబేయే ముందు సుబ్బరామయ్య కాశ్యప్‌ను పక్కకు పిలిచి మాట్లాడా డు.

** ** **

వెంకోజి ఎ స్టేట్‌లో రెండు గదుల ఇల్లొకటి అవుట్ హౌస ప్రక్కగా ఉంది. దాన్ని కాశ్యప్‌కి కేటాయించారు. అసూయ, అహంకారం, మితిమీ రిన ఆత్మ విశ్వాసం ఎలాంటి పనులకైనా పురికొ ల్పుతుంది. వెంకోజి దగ్గర దిక్కులేక పంచన చేరిన దూరపు బంధువు లమ్మాయి నవత అనే యువతి ఉంది. మంచి అందగత్తె. ఆ యువతిని నమ్ముకొనే వెంకోజి పందాన్ని కాశాడు.

రోజులు, వారాలు, నెలలు గడిచిపోతున్నాయి. వెంకోజి, సుబ్బరామయ్య ఎవరికి వారే తాము పందెంలో నెగ్గాలన్నదే లక్ష్యంగా పెట్టుకొని కాశ్య ప్‌ని ప్రభావితం చేయసాగారు. నవతను కాశ్య ప్‌పై ఆయుధంగా ప్రయోగించాడు వెంకోజి.

అయితే కాశ్యప్ వేరే ఆలోచనల్లో ఉన్నాడు. 729 రోజులు గడిచిపోయాయి. పందెం గెలుపు ఎవరివైపు అనేది మరో 24 గంటల్లో తేలనున్నది.

ఎవరి వైపు అన్నది తెలియకుండా గొప్పగా నటిస్తున్నాడు కాశ్యప్.

మరో రెండు గంటల్లో పందెం గడువు అయిపో తుందనగా సుబ్బరామయ్యకి ఫోన్ చేశాడు కాశ్యప్: "మీరు ఓడిపోతున్నారు...పది లక్షలు సిద్ధం చేసుకోండి..."

ఆ ఫోన్‌ను క్రాస్ చేసి విన్న వెంకోజీరావు ఆనందానికి అవధుల్లేవు. అంటే, కాశ్యప్ నవతను ప్రేమిస్తున్నాడన్న మాట...ఆలోచనల్లో ఉన్న వెంకో జి దగ్గరకు కాశ్యప్ వచ్చాడు.

"రావోయ్...రా..." చిద్విలాసంగా నవ్వుతూ ఆహ్వానించాడు. అతని ముఖంలో పందెం గెలు స్తున్నానన్న ఆనందం. సుబ్బరామయ్యను దెబ్బ తీస్తున్నానన్న గర్వం తొణికిసలాడాయి. పైసా కట్నం లేకుండా తనకు గుదిబండ అయిన నవతను వదిలించుకో గలుగుతున్నందుకు, పైపె చ్చు తొమ్మిది లక్షలు తనకు రాబోతున్న తాలూకు ఆనందంతో వెంకోజి కళ్ళు విజయగర్వంతో మెరిసిపోతున్నాయి.

దాన్ని కాశ్యప్ గమనించకపోలేదు. "ప్రేమాభి మానాలు లేని జీవితాలు వ్యర్థం. అనుభూతులు లేకుండా బ్రతకటం దుర్భరం. మనిషంటే యంత్రం కాదుగదా! నే నీ నిర్ణయానికి వచ్చాను కనుక పందెం మీరే గెలుస్తున్నట్లు..."

"యూ ఆర్ రైట్, కాశ్యప్" అన్నాడు వెంకోజి ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అవుతూ.

"అయితే నేను మీ ఇంట్లోని అమ్మాయిని తీసుక ని వెళ్తున్నాను. ఆమెను పెళ్ళికూడా చేసుకుంటా ను" అన్నాడు కాశ్యప్.

"నిరభ్యంతరంగా వెళ్ళొచ్చు, కాశ్యప్."

"మరి నా పందెం వాటా లక్ష...?"

కాశ్యప్‌ని ఎంత తొందరగా వదిలించుకుందా మా అని ఎదురుచూస్తున్న వెంకోజి వెంటనే లేచి "చూడు...సుబ్బరామయ్య ఓడిపోయాడు. రేపు పది లక్షలు తెచ్చిస్తాడు. అందులో నీకు లక్ష ఇవ్వాలి. ఇప్పుడు నేనే ఇచ్చేస్తాను నీకు. రేపొచ్చే పది లక్షలు నే నుంచుకుంటాను" అంటూ బీరువా దగ్గరకు వెళ్ళి లక్ష రూపాయలు బ్రీఫ్‌కే సులో పెట్టి తీసుకొచ్చి కాశ్యప్‌కి అందించాడు.

గుట్టుచప్పుడు కాకుండా అర్ధరాత్రి లక్ష రూపా యలతో, అమ్మాయితో బయటికి వెళ్ళిపోయాడు కాశ్యప్.

తెల్లవారింది. సుబ్బరామయ్య డబ్బుతో వచ్చా డు.

'చూశావా! నేనే గెలిచాను' అన్నట్లు గర్వంగా చూస్తూ పది లక్షలు అందుకున్నాడు వెంకోజి.

అయితే పందెం ఓడిపోయానన్న బాధ, అవ మానం సుబ్బరామయ్య ముఖంలో కించిత్‌మాత్రం కనిపించకపోవటం వెంకోజికి ఆశ్చర్యాన్ని కలి గించింది.

"తాత్కాలికంగా నేను పందెం ఓడిపోవచ్చు. కానీ చివరకు గెలుపు నాదే అవుతుంది..." ఉన్న ట్టుండి అన్నాడు సుబ్బరామయ్య.

ముందు అత నేమంటున్నాడో అర్థం కాలేదు వెంకోజికి. అంతలో నవత పరిగెత్తుకుంటూ వచ్చి "మామయ్యా! చైతన్య కనిపించటం లేదు" అంది.

పీడ వదిలిందనుకున్న నవత ఉండడమే మిటి? కాశ్యప్ కంటపడకుండా కాపాడుకుంటూ వస్తూన్న తన గారాల కూతురు చైతన్య కనిపించక పోవటం ఏమిటి...? చైతన్య వెంకోజి ప్రథమ సంతానం. ఆ తరవాత ఒక మగ పిల్లవాడు. చైతన్య ఇటీవలే ఇంగ్లాండ్‌లో మోడరన్ ఆర్కిటె క్చర్ పూర్తిచేసి వచ్చింది. వచ్చి నెలే అయింది.

అప్పుడు సుబ్బరామయ్య విజయ గర్వంతో




"నాకు పది లక్షలు ఒక లెఖ్ఖకాదు. మరో రెండు రోజుల్లో తన భార్యకు రావలసిన వాటాని మర్యా దగా అప్పజెప్పమనీ, లేదంటే చట్టపరంగా చర్య తీసుకోవాల్సి వస్తుందనీ ఓ నోటీసు కాశ్యప్ నుంచి రానున్నది. నీ ఆస్తంతా నీ తండ్రి ఇచ్చిందే. వాటా ఇవ్వనంటానికి వీలులేదు. నీ కొడుకుతోపాటూ లేచిపోయిన నీ కూతురికి కూడా వాటా ఇవ్వడానికి సిద్ధంకావాలి" అంటూ మీసాలు మెలేస్తూ లేచా డు సుబ్బరామయ్య.

"ఈ ప్రేమాగీమాఏవైనా డబ్బు తర్వాతే. మన పందానికి ఉపయోగపడినందుకు మనం ఇవ్వా ల్సిన లక్ష నిన్ననే నీ దగ్గర తీసుకొ నుంటాడు. అతన్ని ఆపితే పందెం ఎక్కడ తిరగబడుతుందో నని నేను పందెం డబ్బు తేకముందే నీ విచ్చేశావు", అని ఒకింత ఆగి ఊపిరి పీల్చుకుని మరలా మొదలు పెట్టాడు సుబ్బరామయ్య: "నువ్వు గెలిచా వని సంబరపడకు. కాశ్యప్ చాలా తెలివి కలవా డు. నా అయిదు లక్షలకోసం డబ్బే గొప్పదని రుజువు చేస్తే అతనికి దక్కేది ఆరు లక్షలే. ప్రేమ గొప్పదని తెలివిగా రుజువు చేస్తూ నీ కూతుర్ని లేవుకెళ్తే పందెం లక్షతోపాటూ నీ ఆస్తిలో మూడో వంతు వాటా ముప్పై లక్షలు వస్తాయి. ఎవరు గెల్చారంటావ్? ఎవరు తెలివికలవా రంటావ్?" అడిగాడు గర్వంగా భుజా లెగరవేస్తూ.

వెంకోజి తల దిమ్మెక్కిపోయింది.

సుబ్బరామయ్య పెదాలు వంకరగా కదిలిస్తూ అన్నాడు ఇంగ్లీషులో...

"మనీ ఈజ్ గ్రేటర్ దేన్ లవ్
లవ్ ఈజ్ చీపర్ దేన్ ఎనీ
లవర్స్ ఆర్ నథింగ్ బట్ పాపర్స్."

"నీ కూతురు ఒక సర్వర్‌తో లేచిపోయింది. పది లక్షలు పోగొట్టుకున్నందుకు ప్రతీకారంగా దీన్ని రేపు నేను ఊరంతా ప్రచారం చేస్తాను. నీ బాధ తగ్గేందుకు ఉపశమనంగా ఆఖరుగా ఓ పిట్ట కథ చెబుతాను.

వెనకటికి తెనాలి రామలింగడికి ఓ దేవత ఓ చేతిలో పాల గిన్నెతో, ఓ చేతిలో తేనెగిన్నెతో ప్రత్యక్షమై పాలు తాగితే కవిత్వం అబ్బుతుంది. తేనె తాగితే ధనలక్ష్మి వస్తుంది-ఈ రెంటిలో ఏదో ఒకటి తీసుకో అంటూ చేతులు రెండూ ముందుకు చాచితే, రెంటి విలువ గుర్తించిన రామలింగడు అతి తెలివిగా రెండు గిన్నెలు లాగేసుకుని తాగే స్తాడు హఠాత్తుగా. అప్పుడు కోపం వచ్చిన దేవత వికటకవి అయిపోమని శపించింది. అతి తెలివితే టలున్న లింగడ్ని వికటకవి కమ్మని శపించింది. కానీ, గొప్ప తెలివితేటలున్న కాశ్యప్‌ని మనం ఏమనీ శపించలేం కదా?" ఓడి గెలిచిన సుబ్బరా మయ్య దర్జాగా బయటకు నడిచాడు.

** ** **

గుళ్ళో శాస్త్రోక్తంగా చైతన్యను తనదాన్నిగా చేసు కొని మామ వెంకోజి ఇంటికి లాయర్‌ని వెంటబెట్టు కొని వస్తూ కాశ్యప్ చైతన్య చెవిలో చిన్నగా, చిలిపిగా అన్నాడు-

"లవ్ ఈజ్ గ్రేటర్ దేన్ మనీ
మనీ ఈజ్ గ్రేటర్ దేన్ లవ్
బట్ లవ్ విత్ మనీ ఈజ్ గ్రేటర్ దేన్ ఎనీ."

★